క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



తోట్లవల్లూరు: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీవైష్ణవి హౌసింగ్ ఎస్టేట్స్ అండ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు ప్రతినిధి నల్లూరి శివాజీ సూచించారు. స్థానిక గౌడ కల్యాణ మండపంలో సంస్థ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఆదివారం జరిగింది. గుంటూరు ప్రభుత్వ వైద్యశాల అసిస్టెంట్ సూపరింటెండెంట్ డాక్టర్ జైకృష్ణ, డాక్టర్ శ్యామ్, డాక్టర్ రామనామం సుమారు 90 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఎండీ పెదపూడి కిషోర్ పాల్గొన్నారు.

గుంతలను పూడ్చండి



గుడివాడ టౌన్: స్థానిక బస్టాండ్ సమీపంలోని శరత్ టాకీస్ ఎదురుగా వాసవీచౌక్‌లో రోడ్డుపై ఏర్పడిన గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఏర్పడిన ఈ గుంతలను పూడ్చేందుకు ఎవరూ శ్రద్ధచూపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షంవస్తే గుంతల్లో నీరు నిలుస్తోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



గుడ్లవల్లేరు: వర్షంలో సైతం శ్రీ కొండలమ్మ అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూల్లో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు.

చికెన్ ధర తగ్గుముఖం



గుడ్లవల్లేరు: చికెన్ ధర తగ్గుముఖం పట్టింది. కిలో రూ.240 లేక రూ.220 ఉండే కిలో చికెన్ ధర ప్రస్తుతం రూ.160 నుంచి రూ.170గా ఉంది. దీంతో ఆదివారం మాంసాహార ప్రియులు చికెన్‌పై ఆసక్తి చూపారు. అలా అని మటన్‌పై ఏ మాత్రం మొగ్గు తగ్గలేదు. కిలో మటన్ రూ.800 ఉన్నా.. అది తినేందుకే కస్టమర్స్ ఇష్టపడుతున్నారు. అలాగే కిలో చేపలు రూ.200నుంచి రూ.400వరకు ధరలు వాటి జాతులను బట్టి అమ్ముతున్నారు. పీతలు కిలో రూ.250 నుంచి రూ.400 వరకు సైజులను బట్టి విక్రయిస్తున్నారు.

యురియా కొరత లేకుండా చూడాలి

ముదినేపల్లి రూరల్: మండలంలోని రైతులకు యురియా కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ బూత్ లెవల్ కమిటీ ఉపాధ్యక్షుడు మంగినేని బాబ్జి కోరారు. ముదినేపల్లిలో ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులను యురియా కొరత వేధిస్తోందన్నారు. పొలాలకు సాగునీరు అందక ఇబ్బంది పడుతుంటే మరోవైపు యురియా కొరత వేధించడం బాధాకరమన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో రైతులు ఏనాడు సాగునీటికి, ఎరువులకు రైతు ఇబ్బంది పడలేదన్నారు. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమర్థ పాలన కారణంగా రైతులు సేద్యాన్ని సజావుగా కొనసాగించినట్లు చెప్పారు. రైతుల బాధలు అర్థం చేసుకుని యురియా కొరతను నివారించడంతో పాటు సాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పంటకు ఊపిరి పోసిన వర్షం

ముదినేపల్లి రూరల్: వరుణుడి కరుణ లేక కాలువల ద్వారా సాగునీరు అందక ఎండిపోతున్న వరిచేలకు శనివారం రాత్రి కురిసిన వర్షం కొంతమేర ఊపిరి పోసింది. 15 రోజులుగా మండిపోతున్న ఎండలు, కాలువల నుంచి సాగునీరు అందక మండలంలోని అనేక గ్రామాల్లో వరిచేలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మరికొద్దిరోజులు ఇదే పరిస్థితి కొనసాగితే రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. ఇలాంటి పరిస్థితుల్లో శనివారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షం కొంతమేర ఆదుకుంది. ప్రధానంగా ఇసుక భూముల్లో నేరుగా విత్తనాలు వెదజల్లిన వరిచేలకు ఈ వర్షం ఎంతో ప్రయోజనకరమని రైతులు చెబుతున్నారు.

ఎరువు.. కరువు

- సొసైటీల్లో నిల్.. ఎరువుల దుకాణాల్లో ఫుల్
- బడా రైతుల చేతివాటం
- సొసైటీల్లో గంట వ్యవధిలోనే ఎరువులు మాయం
- యూరియా దొరక్క సన్నకారు రైతుల పాట్లు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ గణేష్‌రెడ్డి (ఫైల్)



వరిపైరు

పమిడిముక్కల: యూరియా అందక మండలంలోని రైతులు అవస్థలు పడుతున్నారు. వరికి మొదటి దఫా వేసేందుకు యూరియా కోసం సొసైటీల చుట్టూ తిరుగుతున్నారు. సొసైటీల్లో ఎక్కడా అందుబాటులో లేదని చెప్పడంతో ఆందోళన చెందుతున్నారు. సొసైటీలకు లోడ్ వచ్చిన గంట వ్యవధిలోనే బడా రైతులు, కూటమి నాయకులు తీసుకెళ్లిపోతున్నారు. దీంతో సన్న, చిన్నకారు, కౌలు రైతులకు యూరియా అందని పరిస్థితి నెలకొంది.

20 వేల ఎకరాల్లో వరిసాగు

మండలంలో 20 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. తొలుత నాట్లు వేసేందుకు నీరందక రైతులు ఇబ్బందులు పడ్డారు. బోర్ల కింద నారుమడులు పోసుకుని నాట్లు వేసుకున్నారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు కపిలేశ్వరపురం, తాడంకి, గురజాడ పొలాలు ముంపునకు గురయ్యాయి. ప్రస్తుతం వరిపైరు ఏపుగా ఎదుగుతోంది. మొదటి దఫా వేసేందుకు ఎకరానికి కట్టన్నర యూరియా, కట్ట డీఏపీ అవసరం. కానీ వ్యవసాయశాఖ అధికారులు మాత్రం అరకట్ట మాత్రమే సరిపోతుందని చెబుతున్నారు. రైతులకు అవసరమైన మేర ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందనే విమర్శలున్నాయి.

గంటల వ్యవధిలోనే తరలింపు

రైతులు యూరియా కోసం సొసైటీలకు వెళుతుంటే నోస్టాక్ అనే సమాధానం ఇస్తున్నారు. బడా రైతులు, కూటమి నాయకులు వచ్చిన స్టాక్‌ను గంటల వ్యవధిలోనే తరలించుకు పోతున్నారు. దీంతో యూరియా అందక సన్న, చిన్న కారు, కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ కార్డుకు రెండు కట్టల చొప్పున ఇస్తున్నామని సొసైటీల్లో చెబుతున్నా, వచ్చిన స్టాక్ ఎంత, పెద్ద రైతులకు ఎంత ఇచ్చారు, చిన్న రైతులకు ఎంతిచ్చారనే వివరాలు చెప్పలేకపోతున్నారు. బడా రైతులు సంవత్సరానికి సరిపడా నిల్వ చేసుకున్నారు. మరికొంత మంది మొక్కజొన్న పంటకు కూడా నిల్వ చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితుల్లో సన్న, చిన్నకారు, కౌలు రైతులను పట్టించుకునే వారే లేరు.

అధిక ధరలకు విక్రయం

ఎరువుల దుకాణాల్లో మాత్రం యూరియా అందుబాటులో ఉంది. కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామనే మెలిక పెట్టి విక్రయిస్తున్నారు. యూరియా కట్ట రూ.267 కాగా దుకాణాల్లో రూ.380 చొప్పున వసూలు చేస్తున్నారు. ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయని సన్నకారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యూరియా సరఫరా చేయాలి



సొసైటీలకు అవసరమైన మేర యూరియా సరఫరా చేయాలి. వచ్చిన స్టాక్‌ను అందరికీ సమానంగా అందేలా చర్యలు తీసుకోవాలి. బయట మార్కెట్‌లో ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. ఇటీవల పొలాలు ముంపునకు గురై ఇబ్బందులు పడ్డాం. మళ్లీ యూరియా దొరక్క అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం రైతులను పట్టించుకునే పరిస్థితి లేదు.

– రాజులపాటి గురవయ్య, రైతు, గురజాడ

విజిలెన్స్ దాడులు జరపాలి



బడా రైతులు, కూటమి నాయకుల ఇళ్ల వద్ద పెద్ద మొత్తంలో యూరియా నిల్వ ఉంది. సొసైటీ ఉద్యోగులను బెదిరించి స్టాకంతా తరలించుకుపోయారు. సన్న, చిన్నకారు, కౌలు రైతులు బయట ఎక్కువ ధరకు కొనుక్కోవాల్సి వస్తోంది. సంవత్సరానికి సరిపడ కొందరు, మొక్కజొన్నకు కొందరు నిల్వ చేసుకున్నారు. విజిలెన్స్ దాడులు జరిపి యూరియాను స్వాధీనం చేసుకోవాలి.

– కనుమూరి వెంకటేశ్వరరావు, కౌలురైతు, లంకపల్లి

ఆందోళన చెందొద్దు



యూరియా కొరత వస్తుందనే పుకార్లతో కొంతమంది నిల్వ చేసుకుంటున్నారు. మండలంలోని 20 వేల ఎకరాలకు 900 మెట్రిక్ టన్నులు అవసరం కాగా ఇప్పటివరకు సొసైటీల ద్వారా 900 మెట్రిక్ టన్నులు, దుకాణాల ద్వారా 250 మెట్రిక్ టన్నులు సరఫరా చేశారు. రెండు రోజుల్లో 10 సొసైటీలకు 100 మెట్రిక్ టన్నులు వస్తుంది. రైతులు ఆందోళన చెందవద్దు.

– గణేష్‌రెడ్డి, ఏఓ

శ్యామలాంబకు రజిత సింహ వాహనం బహూకరణ

కైకలూరు: గ్రామ ఇలవేల్పు శ్యామలాంబ అమ్మకు ఏలూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పిచ్చికల నాగేశ్వరరావు, కైకలూరులో పిచ్చికల వంశీయులు కలిపి నాలుగు కేజీల 35 గ్రాముల బరువు కలిగిన, రూ.4.61 లక్షల విలువగల రజిత సింహ వాహన్ని ఆదివారం బహూకరించారు. కైకలూరుకు చెందిన న్యాయవాది పిచ్చికల పవన్ కాంత్ నివాసం నుంచి రజిత సింహ వాహనాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు.



శ్యామలాంబకు రజిత సింహవాహనాన్ని అందిస్తున్న దాతలు

గుర్రపు డెక్కను తొలగించాలి



సుబేదార్‌చెరువు వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్క



మల్లమాలపల్లి వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్క

కాజ(మొవ్వ): మొవ్వ మండలంలోని పలు డ్రెయిన్లలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని కాజ గ్రామంలోని ఐనంపూడి డ్రెయిన్‌లో మల్లమాలపల్లి దగ్గర నుంచి సుబేదార్ చెరువు వరకు సుమారు అర కిలోమీటరు మేర గుర్రపు డెక్క పూర్తిగా పేరుకు పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది సుబేదార్ చెరువు వద్ద గుర్రపు డెక్క పేరుకు పోవటంతో కట్ట తెగిపోయి గండి పడిందని పేర్కొన్నారు. రైతులకు నష్టం కలుగకుండా సుమారు రూ.20 లక్షల వ్యయంతో గండి పూడ్చారన్నారు. అయితే ఇదే తరహాలో గ్రామంలోని డ్రెయిన్లలో గుర్రపు డెక్క పేరుకుపోయిందని, దీనిని వెంటనే తొలగించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి మండ శ్రీనివాసరెడ్డి కోరారు. ఈ ఏడాది వేసవిలో డ్రోన్‌ల సాయంతో కలుపు నివారణ మందును పిచికారీ చేసినా ఫలితం లేదని పేర్కొన్నారు.

క్యాన్సర్ నివారణపై అవగాహనకు 2కే రన్

హనుమాన్‌జంక్షన్ రూరల్: హెచ్‌పీవీ వైరస్ ద్వారా సంక్రమించే క్యాన్సర్ నివారణపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు హనుమాన్‌జంక్షన్‌లో ఆదివారం 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక శేరినరసన్నపాలెం రోడ్డులోని మెడివ్యాలీ హాస్పిటల్స్ నేతృత్వంలో చేపట్టిన 2కే రన్‌కు డాక్టర్లు, వైద్య సిబ్బంది, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. హెచ్‌పీవీ వైరస్ ద్వారా కలిగే క్యాన్సర్‌ను నివారించటానికి వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలిలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేశారు.



హనుమాన్‌జంక్షన్‌లో నిర్వహించిన 2కే రన్‌లో పాల్గొన్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

పామర్రు నుంచి రైతు రథయాత్ర

పామర్రు(మొవ్వ): అన్నదాత సుఖీభవ విజయోత్సవం పేరిట ఆదివారం టీడీపీ ఆధ్వర్యంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ట్రాక్టర్లతో రైతు రథయాత్ర నిర్వహించారు. ఈ యాత్ర పామర్రు నుంచి కొత్తూరు మీదుగా బల్లిపర్రు, కురుమద్దాలి గ్రామాల మీదుగా మార్కెట్ యార్డ్ వరకు సాగింది. అనంతరం మార్కెట్ యార్డులో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా భావించిన కూటమి ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ పథకంలో భాగంగా ఒక్కొక్క రైతు బ్యాంకు ఖాతాలో రూ.7 వేలు జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నరేష్, ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, ఏఎంసీ చైర్మన్ జన్ను శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

యువతలో అధికమవుతున్న వినికిడి సమస్యలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: యువత అధికంగా సెల్‌ఫోన్‌లో మాట్లాడటం, ఇయర్ ఫోన్స్ వినియోగించటం వల్ల చిన్న వయస్సులో వినికిడి లోపాన్ని ఎదుర్కొంటున్నారని ప్రముఖ కాక్లియర్ ఇంప్లాంట్ వైద్య నిపుణులు యార్లగడ్డ సుబ్బారాయుడు, ఈఎన్‌టీ వైద్య నిపుణులు రాయల్ ప్రీతమ్ పేర్కొన్నారు. బాపులపాడు మండలం బొమ్ములూరులో సీతారామస్వామి దేవస్థానం ట్రస్ట్, ప్రవాసాంధ్రురాలు కోవి శ్లోక నేతృత్వంలో వినికిడి, చెవి సంబంధిత సమస్యలపై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. వయోభారంతో వృద్ధుల్లో కలిగే వినికిడి లోపంతో పాటుగా ఇటీవలి కాలంలో యువతలోనూ ఈ సమస్య అధికమవుతుందని డాక్టర్లు చెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ఒక బిలియన్ కంటే ఎక్కువ మంది యువత తప్పు వినికిడి అలవాట్ల వల్ల శాశ్వత శ్రవణ నష్టానికి గురవుతున్నారని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే చెవి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటిస్తే వృద్ధాప్యంలోనూ వినికిడి లోపం రాదని చెప్పారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించటంతో పాటుగా అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, వినికిడి యంత్రాలు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. ఆడియాలజిస్ట్ శ్రీను నాయక్, రాధిక రాయుడు, ఆస్పత్రి సిబ్బంది, గ్రామ ప్రముఖులు ముసునూరు కాశీవిశ్వేశ్వరరావు, కోవి శశిధర్ పాల్గొన్నారు.



వృద్ధులకు వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తీరప్రాంత గ్రామస్తులకు చట్టాలపై అవగాహన

కోడూరు: సముద్రతీర ప్రాంత గ్రామస్తులకు ఆదివారం మెరైన్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. పాలకాయతిప్ప గ్రామంలో మెరైన్ ఎస్‌ఐ పూర్ణమాధురి గ్రామస్తులకు వివిధ రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. విపత్తుల సమయంలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తాయని, గ్రామస్తులకు భరోసా కల్పించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. గ్రామస్తులకు ఏమైనా సమస్యలు ఉంటే గ్రామంలో ఉన్న మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని, వాటిని పరిష్కరించేందుకు సంబంధిత శాఖతో కలిసి పని చేయనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సాగర్‌మిత్ర సీహెచ్ మోషే, వీఆర్‌ఏలు కె.అర్జున్, ఎన్.గోపిచంద్, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మెరైన్ ఎస్‌ఐ పూర్ణమాధురి

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

నాగాయలంక: ఏపీ యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవం యూనియన్ మండలశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఏవీఎస్ అండ్ టీకేఆర్ యూటీఎఫ్ భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత జిల్లా శాఖ కార్యదర్శి బండ్రెడ్డి గోవర్ధన గోపాలకృష్ణ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యారంగం అభ్యున్నతికి యూనియన్ చేస్తున్న కృషిని పలువురు నాయకులు వివరించారు. యూనియన్ మండలశాఖ అధ్యక్షుడు తెనాలి శ్రీనుబాబు బండ్రెడ్డి సాంబశివరావు, సబ్బినేని సురేషబాబు, బండ్రెడ్డి శివరామకృష్ణ, మద్ది శ్రీనివాసరావు, సీనియర్ నేతలు ఎస్‌బీబీవీ ప్రసాద్, వనమా రామకృష్ణ, ఎం.వెంకటేశ్వరరావు, టి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ పతాకం ఆవిష్కరించిన గోపాలకృష్ణ తదితరులు

ఘనంగా గంగానమ్మ జాతర

తోట్లవల్లూరు: గంగానమ్మ తల్లి ప్రజలను చల్లగా చూడాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆకాంక్షించారు. మండలంలోని యాకమూరులో గంగానమ్మ జాతరను ఆదివారం ఆయన ప్రారంభించారు. గంగానమ్మ తల్లికి అనిల్‌కుమార్ పూజలు నిర్వహించి, ప్రజలు ఆయురారోగ్యాలు, పాడి,పంటలతో కళకళలాడేలా ఆశీర్వదించాలని ప్రార్థించారు. సర్పంచ్‌లు బొమ్మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, శీలం రమేష్, ఉమ్మడిశెట్టి ఉదయభాస్కర్, నాయకులు గాదె కిషోర్‌రెడ్డి, గాదె సురేంద్రరెడ్డి, చింతలపూడి గవాస్కర్‌రాజు, ఈడ్పుగంటి రూబెన్, తిరుమలశెట్టి వాసు, గాదె ఉమా, బొమ్మారెడ్డి గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మకు భక్తుల పూజలు

తోట్లవల్లూరులో శుక్రవారం నుంచి ప్రారంభమైన గంగానమ్మ జాతర ఆదివారం వైభవంగా ముగిసింది. తొలి రోజైన శుక్రవారం మానుపూజ, రెండో రోజైన శనివారం పోతురాజు గెడ ఊరేగింపు, మూడో రోజైన ఆదివారం మొక్కుల చెల్లింపుతో జాతర ముగిసినట్లయింది. భక్తులు అధికసంఖ్యలో గంగానమ్మ తల్లి, పోతురాజుస్వామిని దర్శించుకుని పాలపొంగళ్లు సమర్పించారు. ఆయా కార్యక్రమాలను యాదవ సంఘం ప్రతినిధులు పర్యవేక్షించారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా గంగానమ్మ జాతర కార్యక్రమాలు నిర్వహించారు. వెలమపేట కమిటీ ఆధ్వర్యంలో గంగానమ్మ జాతర జరిగింది. ఉనికిలి ఎస్సీ కాలనీలో కనుల పండువగా జాతర నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమతో నైవేద్యాలు సమర్పించారు. తీన్మార్ డప్పుల నడుమ అమ్మవారిని, పోతురాజును పురవీధుల్లో ఊరేగించారు. మాజీ సర్పంచ్ కారే వెంకటలక్ష్మి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కారే ధర్మారావు, గెద్దం కొండలరావు, కుర్మా కొండలరావు, పరంజ్యోతి, టి.బ్రహ్మం పాల్గొన్నారు.



యాకమూరులో గంగానమ్మ తల్లికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



తోట్లవల్లూరులో భక్తుల పూజలందుకున్న గంగానమ్మ తల్లి



ఉనికిలి ఎస్సీ కాలనీలో గంగానమ్మ జాతరలో నృత్యం



వడాలిలో గంగానమ్మ జాతరలో పాల్గొన్న భక్తులు

వడాలిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలిలో గంగానమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనేకమంది భక్తులు అమ్మవారిని వీధుల్లో ఊరేగింపు చేశారు. యువకులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు చేశారు. మహిళలు నైవేద్యాలు తయారుచేసి ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి సమర్పించారు.

కైకలూరులో..

కైకలూరు: స్థానిక బైపాస్ రోడ్ గంగానమ్మ జాతర ఆదివారం అత్యంత ఘనంగా జరిగింది. ముఠా కార్మికులు వేడి నైవేద్యాలు సమర్పించారు. గరక డప్పుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయ నిర్వాహకుడు తులసి పూర్ణ మాట్లాడుతూ గంగానమ్మ వార్షిక జాతర ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు జరుగుతుందని పేర్కొన్నారు. 14న అభిషేకాలు, నైవేద్యాలు, 15న చలినైవేద్యాలు, పూజలు, 16న చలివిడి, పానకం, వడపప్పు, నైవేద్యాలు, 17న అమ్మవారి జాతర, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జాతర నిర్వాహకులు జెట్టి అంజిబాబు, గడిశికోటి నరసింహారావు, శివకుమార్, కటికిన జయప్రకాష్, లక్ష్మణ్, కార్తీక్, సింగ్, పాండురంగారావు పాల్గొన్నారు.



కైకలూరు గంగానమ్మ గుడి వద్ద భక్తుల సందడి

రాఘవేంద్ర స్వామికి విశేష పూజలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసి ఉన్న శ్రీ మంత్రాలయ రాఘవేంద్ర స్వామి వారి 354 ఆరాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పూర్వారాధన, అష్టోత్తర శతనామ పారాయణ, పంచామృతాభిషేకం, తులసి దళార్చన, మధ్యాహ్నం మహా మంగళహారతి, అష్టోదక ప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం వాసవి భజన మండలి బృంద సభ్యులు ఆలపించిన భక్తి కీర్తనలు ఆకట్టుకున్నాయి. స్వస్తి వాచనం నిర్వహించారు.

హర్ ఘర్ తిరంగా ప్రచారం

మండవల్లి: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మండవల్లి శాఖ గ్రంథాలయంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. హర్ ఘర్ తిరంగా ప్రచారంలో భాగంగా హాజరైన విద్యార్థుల్లో దేశభక్తి భావం పెంపొందించారు. మొక్కలు ఏవిధంగా నాటాలి, ఎలా సంరక్షించాలనే విషయంపై అవగాహన కల్పించారు. కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి.అప్పారావు, మండల అధ్యక్షుడు గంజాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, బి దివాకర్, వి వాసవి, గ్రంథాలయాధికారి పర్వీన, విజయలక్ష్మి పాల్గొన్నారు.



గ్రంథాలయం వద్ద మొక్కలు నాటుతున్న ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కరరావు తదితరులు